

విత్తనాలు సిఫార్సులున్నవారికేనా..

సరిపడా వేరుశనగ విత్తనాలు ఇవ్వాలి : మండల మీట్‌లో సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి- యాదమరి: వేరుశనగ విత్తనాలు మండలానికి తక్కువగా రావడంతో వేరుశనగ విత్తనాలు సిఫార్సులు ఉన్న వారికే ఇస్తారా... లేకుంటే సామాన్య రైతులకు సరఫరా చేస్తారా... అని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయ అధికారి చరిత మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు తక్కువగా వచ్చాయని గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో నమోదైన వారికి వ్యవసాయ విత్తనాలు అందిస్తామని తెలపడంతో ఈ సంవత్సరం కొత్తగా వేసుకోవలసిన రైతుల పరిస్థితి ఏమిటని సభ్యులు వ్యవసాయ అధికారిని పలువురు సర్పంచులు నిలదీశారు. రైతులకు సరిపడా వేరుశనగ విత్తనాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారిని కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షులు సురేష్ బాబు మాట్లాడుతూ గత సంవత్సరం మండలానికి ఎన్ని వేరుశనగ విత్తనాలు వచ్చాయని ప్రశ్నించారు. 2024లో మండలానికి 1054 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు రాగా ఈ సంవత్సరం కేవలం 684 క్వింటాళ్లు మాత్రమే అని, 40 శాతం మేర వేరుశనగ విత్తనాలు తక్కువగా అందడంతో రైతులు వ్యవసాయ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా విత్తనాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం తెల్లరాళ్లపల్లి సర్పంచ్ బజలింగం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు పనులు చేసి ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో రీ సర్వేలో రెవెన్యూ సమస్యలపై 986 దరఖాస్తులు అందాయని వాటిని పరిష్కరించడం జరిగిందని ప్రస్తుతం రీ సర్వే రైతుల సమక్షంలోని నిర్వహిస్తూ సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ ఏపీఓ సంధ్యారాణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో భూమి ఉన్న ప్రతి రైతు 21 రకాల పండ్లతోటలు పెంచుకునేందుకు రైతులకు అవకాశం కల్పించిందని కావలసినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెల్లరాళ్లపల్లి సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరిగ్గా పౌష్టికాహారం ఇవ్వడం లేదని, అంగన్వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించడం లేదని సర్పంచ్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మండల అభివృద్ధి అధికారి వేణు ఐసిడిఎస్ సూపర్వైజర్‌లను అంగన్వాడీ సెంటర్లను పర్యవేక్షించి నివేదిక అందించాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారి మాట్లాడుతూ తమిళనాడు అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో ఏనుగులు రాకుండా నివారించేందుకు ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో సైనిగుంట నుంచి మొగిలి ఘాట్ వరకు హ్యాంగింగ్ సోలార్ కంచెను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే అటవీ సరిహద్దు ప్రాంతాల రైతుల పొలాలకు ఏనుగులు వచ్చే అవకాశం ఉండదని, సోలార్ ఫెన్సింగ్ ద్వారా ఏనుగులు పంట పొలాలకు రాకుండా నివారించే అవకాశం ఉందని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో రైతులు వారికి కావలసిన కలప మొక్కలను నాటుకునేందుకు ఒక రైతుకు రెండు వందల మొక్కలు ఉచితంగా అందిస్తామని వీటిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈఓపిఆర్‌డి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావున గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని , తద్వారా దోమలు వ్యాప్తిని నిరోధించే విధంగా పంచాయతీ కార్యదర్శులు , సర్పంచులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి ఆర్ అండ్ బి ఏఈ ఆదికేశవులు, రవాణా శాఖ ఆర్టీసీ అధికారులు, హార్టికల్చర్, అధికారులు హాజరు కాలేదు. ఈ సమావేశంలో ఎంపీడీవో వేణు, మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి, వ్యవసాయ అధికారి చరిత, ఇరిగేషన్ ఏఇ ఉషారాణి పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

నేటి నుంచి ఏపీ మెగా డీఎస్సీ

- పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు
- జిల్లాలో 8 కేంద్రాలలో పరీక్షల నిర్వహణ..
- 4 పరీక్షా కేంద్రాలు చిత్తూరు జిల్లా పరిధిలో
- 4 పరీక్షా కేంద్రాలు చెన్నైలో..: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 6వ తేదీ శుక్రవారం నుంచి నిర్వహించే ఏపీ మెగా డీఎస్సీ - 2025 నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఏపీ మెగా డీఎస్సీ - 2025 నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ మెగా డీఎస్సీ - 2025, ఉపాధ్యాయ అర్హత పరీక్షను జూన్ 6వ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ కోసం అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షా కేంద్రాలలో నిర్వహణ ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను నిర్ణయించుకోవడంలో భాగంగా చెన్నైలో పరీక్ష కేంద్రంగా ఎంపిక చేసుకున్న వారికి అక్కడే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాకు సంబంధించి మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా అందులో 4 పరీక్ష కేంద్రాలు చిత్తూరు జిల్లాలో, మరో నాలుగు పరీక్ష కేంద్రాలు చెన్నైలో ఉన్నాయని చెన్నైలో నిర్వహించే పరీక్ష కేంద్రాల నిర్వహణ కూడా చిత్తూరు జిల్లా విద్యాశాఖచే పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. చిత్తూరు జిల్లాలోని 4 పరీక్ష కేంద్రాలలో 22,046 మంది ఈ పరీక్షలకు హాజరవుతుండగా, చెన్నైలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 1,484 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ - 2025 పరీక్షల సజావు నిర్వహణకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఆర్‌డిఓలు వారి పరిధిలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, సైన్ బోర్డ్స్ ఉండాలన్నారు. పరీక్షల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ కిట్టుతో కూడిన ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని అభ్యర్థులకు అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు ఉన్న గ్రీవెన్స్ సెల్ నెంబర్: 90321 85001ను సంప్రదించ వచ్చునని అన్నారు.

జిల్లాలో పరీక్షా కేంద్రాల వివరాలు

1. శ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ (సీతమ్స్) మురకంబట్టు చిత్తూరు.
2. శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఆర్‌విఎస్ నగర్, చిత్తూరు.
3. వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పి.కొత్తకోట, తిరుపతి- చిత్తూరు హైవే, చిత్తూరు.
3. మదర్ థెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరు.

చెన్నైలో పరీక్ష కేంద్రాల వివరాలు

1. బ్లూ లోటస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, నెహ్రూ నగర్ ఓఎంఆర్ రోడ్ చెన్నై
2. చెవాలియర్ టి. థామస్ ఎలిజిబెత్ కాలేజ్ ఫర్ ఉమెన్, మేరీల్యాండ్, సెంబియన్, పెరంబూరు, చెన్నై
3. మహాలక్ష్మి టెక్ క్యాంపస్, నెంబర్.1, భారతీయర్ స్ట్రీట్, ప్రశాంతి నగర్, చెన్నై.
4. ప్రిన్స్ డాక్టర్ కె.వాసుదేవన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మంబాక్కమ్ - మేడవాక్కం మెయిన్ రోడ్డు, చెంగల్పట్టు డిస్ట్రిక్ట్, చెన్నై.

కళ్లేదుటే.. తమ్ముడి మృతి

- ముగ్గురు పిల్లలను బలితీసుకున్న ఈత సరదా..
- మూడు కుటుంబాల్లో విషాదం



ప్రమాదానికి కారణమైన చెరువు



సంఘటనా స్థలంలో పిల్లల మృతదేహాల వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- వి.కోట

వేసవి సెలవుల్లో పిల్లల ఈత సరదా ప్రాణం మీకు తెచ్చింది. మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. వి. కోట సీఐ సోమశేఖర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు నియోజకవర్గం వి.కోట వద్ద గురువారం మధ్యాహ్నం విషాద ఘటన చోటు చేసుకుంది. వి.కోట మండలం మోట్లపల్లికి బేది, ఆదిల కొడుకులు చెందిన పూర్ణేష్ (11), జగన్ (9) అన్నదమ్ములు. కవిత కొడుకు నిఖిల్ (12), చంద్రకళ, రెడ్డప్పల కుషాల్ (11) పెద్దనాన్న, చిన్నాన్న కొడుకులు. వేసవి సెలవలు కావడంతో గ్రామ సమీపంలోని చెరువు వద్దకు ఈతకు వెళ్లారు. పూర్ణేష్ మినహా మిగతా ముగ్గురు పిల్లలు నీటిలోకి దిగారు. కొద్దిసేపటికి వారంతా నీటిలో మునిగిపోతున్నట్లు గమనించిన ఒడ్డునే ఉన్న పూర్ణేష్ ప్రమాదాన్ని గ్రహించాడు. తాను ఎంతగా హెచ్చరిస్తున్నా, తమ్ముడు జగన్‌తోపాటు మిగతా ఇద్దరు పిల్లలు నిఖిల్, కుషాల్ వినిపించుకోకపోవడంతో పూర్ణేష్ ఆందోళనకు గురయ్యాడు. చెరువులో నీట మునుగుతున్న ముగ్గురిలో తమ్ముడు జగన్ (9)కూడా ఉండడంతో ఆ దృశ్యం చూస్తున్న అన్న పూర్ణేష్ తల్లడిల్లాడు. తమ్ముడు ముందుకు వెళ్లకు.. వెనక్కి వచ్చేయ్ అని కేకలు పెడుతున్నాడు. అప్పటికే బురదలో కూరుకుపోవడం గమనించిన పూర్ణేష్ భయంతో కేకలు వేసుకుంటూ గ్రామంలోకి వెళ్లి చెప్పాడు. చెరువువద్దకు చేరుకున్న గ్రామస్తులు నీట మునుగుతున్న ముగ్గురు బాలురను ఒడ్డుకు తీసుకువచ్చారు. వారిలో అప్పటికే ఇద్దరు మరణించినట్లు గుర్తించారు. కొన ఊపరితో ఉన్న మరో బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చెరువు గట్టు వద్ద పిల్లల తల్లిదండ్రుల రోధనలు, వేదన వర్ణనాతీతం. పిల్లల మృతితో గ్రామంలోని మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. సిఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


జగన్ (ఫైల్ ఫొటో)


నిఖిల్ (ఫైల్ ఫొటో)


కుషాల్ (ఫైల్ ఫొటో)

విచారం వ్యక్తం చేసిన మంత్రి, ఎమ్మెల్యే

వికోట మండలం మోట్లపల్లికి చెందిన ముగ్గురు బాలురు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందడం చాలా బాధాకరమని రాష్ట్ర ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక అధికారులతో మంత్రి, ఎమ్మెల్యే టెలిఫోన్ ద్వారా మాట్లాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా ఉండాలని స్థానిక నాయకులకు వారు ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే ఆఫీసులో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో 6వ తేదీ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

అటల్ ల్యాబ్‌ను సందర్శించిన అమెరికా బృందం



ప్రజాశక్తి- శాంతిపురం: స్థానిక పరమహంస యోగానంద విద్యాలయంలో ఉన్న అటల్ ల్యాబ్‌ను అమెరికాకు చెందిన లెహిఫ్ విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్ ఎరిక్ ఒబేసేకరే, థియోడర్ స్పియర్, ఎమ్మా నజారియన్, లిలియా గనా, నాడ్జిలీ జిమెనెజ్ బీల్మా. స్విన్‌బర్న్ విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్ జాసన్ సార్జెంట్, ఎస్‌విఎన్ఆర్ నుండి చందు బరోల్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ల్యాబ్‌లో నిర్వహించబడుతున్న కృత్యాలు, అభివృద్ధి అంశాలను పరిశీలించి ఎంతగానో ప్రశంసించారు. వీరితోపాటు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుండి నటేష్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌చాయా దేవి వారి వెంట ఉండి సందర్శించారు. ఈకార్యక్రమంలో విద్యాలయానికి చెందిన ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్, అటల్ ల్యాబ్ ఇంచార్జ్ అక్షిత పాల్గొన్నారు.

చెట్లు లేకుంటే మానవ మనుగడకు ప్రమాదం..

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాబోయే తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించడం కోసం ప్రతి ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం 2025లో భాగంగా గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయమూర్తులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి మొక్కలు నాటి వాటి సంరక్షణ తీసుకొంటామని, ప్లాస్టిక్ వాడమని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారులు రాజశేఖర్ కుమార్, జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగంగా 30 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు:డిఎఫ్ఓ

చిత్తూరు అర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్ మోహన్ తెలిపారు. గురువారం చిత్తూరు ఫారెస్ట్ వెస్ట్ రేంజ్‌కు సంబంధించి మురకంబట్టు సమీపంలో గల నీవా నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం కార్యక్రమానికి డిఎఫ్ఓ భరణితో కలసి చిత్తూరు ఎంఎల్ఏ రహదారి పక్కన మొక్కలు నాటి నీరు పోశారు. డిఎఫ్ఓ భరణి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో 30 లక్షల మొక్కలు నాటడం ప్రధాన లక్ష్యంగా జిల్లా అటవీ శాఖ పని చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వలన భూ కాలుష్యం పెరుగుతోందని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆర్‌విఎస్ కాలేజీ విద్యార్థులు, రెయిన్ బో ఇంటర్నేషనల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మరమ్మత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణకు అనువుగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీకేపల్లి నుండి మోడ్రన్ కాలనీ రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.


కుప్పంలో..

కుప్పం రూరల్ : కుప్పం అటవీశాఖ అధికారి జయశంకర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని కంగుంది అటవీ పరిధికి చెందిన దొరవారి చెరువు ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడా పీడి వికాస్ మరమ్మత్ హాజరై చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 200కు పైగా వివిధ పళ్ళ మొక్కలను నాటినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు.



పలమనేరులో..

విజయపురం (నగరి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. గురువారం నగరి మున్సిపాలిటీలోని అధికారులందరూ సంయుక్తంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరుపోశారు. ఎన్విరాన్మెంట్ ఈఈ రాజశేఖర్, సిఐ విక్రమ్, ఎఈలు నవీన్, హేమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్ పురుషోత్తం, మెప్మా సీఎంఎం ప్రసాద్, పురపాలక, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని మండల అభివృద్ధి అధికారి వేణు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపిసిలో మొక్కలు నాటారు. మండల పరిధిలోని ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన ఫారం పాండ్ నీటి కుంటల గట్లపై, పొలాల గట్లపై రైతులు, ఉపాధి కూలీలతో పెద్ద ఎత్తున ఏపీవో ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి, మండల అభివృద్ధి అధికారి వేణు, ఏపీ సంధ్యారాణి, ఈఓపిఆర్డి సుకుమార్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలమనేరు రూరల్ మండలం ముసలమడుగు ఏనుగులు క్యాంపు వద్ద పలమనేరు అటవీ శాఖ అధికారులు, ఆర్డీవో భవాని, పలమనేరు స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ నారాయణ, పలమనేరు పరిరక్షణ సమితి, జంతు ప్రేమికులు పాల్గొని మొక్కలను నాటారు.

కార్వేటినగరం: పర్యావరణాన్ని పరిరక్షించి మానవ మనుగడకు దోహదపడాలని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెంగల్రా రాజు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఉపాధ్యాయులు వాసుదేవరెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాసులు, సుజల, భీమారావు, చలపతిరావు పాల్గొన్నారు. మండల పరిధిలోని కుప్పాని గుంట నర్సరీ వద్ద అటవీశాఖ అధికారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్, టిడిపి నాయకులు రవియాదవ్ ఘనంగా నిర్వహించారు.

సోమల: సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు గురువారం కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

గుడిపాల: స్థానిక సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్సిసి, బెంగళూరు చెన్నై, ఎక్స్ప్రెస్ వే ఫేస్ త్రీ ప్యాకేజ్ వన్ వారి ఆధ్వర్యంలో మేనేజర్ సంసుల్ హక్, ప్రాజెక్టు మేనేజర్ రామచంద్ర చట్టై మొక్కలు నాటి నీరుపోశారు. అందరూ మొక్కలు విరివిగా నాటాలని పిలుపునిచ్చారు.

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి

పూర్వ వైభవం వచ్చేనా..?

- బాలుర ఎస్సీ వసతి గృహంగా మార్పు కోసం ప్రతిపాదనలు
- మరమ్మతుల కోసం రూ.11.01 లక్షల మంజూరు
- ఇప్పటికే రూ.6.50 లక్షలు ఖర్చు
- ఈ విద్యా సంవత్సరంలో తెరుచుకోనున్న వసతి గృహం



వసతి గృహం ముఖద్వారం

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ భవనాల సముదాయం వద్ద 2010 సంవత్సరంలో రూ.42 లక్షలతో నిర్మించిన సాంఘిక, సంక్షేమ బాలికల వసతి గృహం రెండు సంవత్సరాల క్రితం బాలికల భద్రతా లోపాల కారణంగా వసతి గృహంలో బాలికలు చేరకపోవడంతో మూసివేశారు. ఇటీవల నెల రోజులుగా వసతి గృహంలో ఎలక్ట్రికల్ వర్క్స్, పెయింటింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు, వెల్డింగ్, క్లీనింగ్ వంటి అభివృద్ధి పనులు జరుగుతూ ఉండగా ప్రజాశక్తి వెళ్లి పరిశీలించింది. ఈ క్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహులుతో ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన మాట్లాడుతూ బాలికల వసతి గృహంగా ఉన్న సందర్భంలో సోమలలోని ఉన్నత పాఠశాలకు వసతి గృహానికి చాలా దూరం ఉండడం ప్రభుత్వ భవనాల సముదాయం వద్ద సాయంత్రం 6 గంటల తర్వాత జనసంచారం పూర్తిగా లేకుండాపోవడం భద్రత కరువు కావడం తదితర కారణాలతో వసతి గృహంలో చేరే విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని, చేసేది ఏమీ లేక వసతిగృహాన్ని మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆ తర్వాత లక్షలు పోసి నిర్మించిన అన్ని సౌకర్యాలు ఉన్న వసతి గృహం ఎలాగైనా తిరిగి తెరిపించాలన్న ఉద్దేశంతో కలెక్టర్‌కి బాలుర వసతి గృహంగా మార్పు చేసి తిరిగి నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపగా ఆయన అందుకు అంగీకరించారుని, దీంతో మరమ్మతు పనులకు నిధులు మంజూరు కాగా అవి పనులు పూర్తికాగానే వసతి గృహం పూర్వవైభవం తెచ్చుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


విద్యార్థుల కోసం మంచాలు


వసతి గృహంలో చేతులు కడుక్కునేందుకు ఏర్పాటు చేసిన కొళాయిలు

ఆర్డబ్ల్యూఎస్ జేఈ అనూష మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహంలో మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేయించాలని రూ.11.01లక్షల నిధులు మంజూరు అయ్యాయని వీటిలో ఇప్పటికే రూ.6.50 లక్షల నిధులను ఖర్చు చేసి నీటి కొళాయిలు బిగించడం, ఎలక్ట్రికల్ పనులు చేయించడం, వెల్డింగ్ వర్క్స్, బాత్రూంలో మరమ్మతులు ప్రహరీగోడ వసతి గృహంకు సున్నం కొట్టించడం, ఆవరణం లోపల పిచ్చి మొక్కలు తొలగించడం చేయించామని ఇంకా పనులు మిగిలి ఉన్నాయని మొత్తం పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఏది ఏమైనా మండలంలో రెండు ఎస్సీ హాస్టల్లో కందూరులో ఒకటి సోమలలో ఒకటి ఉండేవి. కందూరులో ఎస్సీ హాస్టల్‌ను కొన్ని కారణాలతో మూసివేయగా సోమలలో బాలుర ఎస్సీ హాస్టల్‌ను బాలికల హాస్టల్‌గా మార్చి కొద్దిరోజులు బాలికలతో నడిపించి ఆ తర్వాత భద్రతా కారణాలతో మూసి వేయడం జరిగింది. ఇప్పటికైనా ఈవిద్యా సంవత్సరంలో బాలుర హాస్టల్ తెరిపించి నిరుపేద విద్యార్థుల చదువుల కోసం హాస్టల్లో వసతి ఉండేలా చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలుపడాలని కోరుకుందాం.

సాయివివేకానంద విద్యార్థికి ప్రతిభా అవార్డు



ప్రజాశక్తి- విజయపురం (నగరి)

పట్టణ పరిధిలోని సాయి వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి ఎంకె.రఘురామ్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యాడు. ఇంటర్‌లో వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు సాధించడంతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవార్డు ప్రకటించింది. అవార్డు సాధించిన విద్యార్థికి కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

పిల్లల సమాచారం కచ్చితంగా ఉండాలి

డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం



పిల్లల పట్ల కచ్చితమైన సమాచారం ఉండాలని డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల కట్టమంచి అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలు వయస్సు, బరువు, ఎత్తు కచ్చితంగా నమోదు చేయాలని, వాటి ద్వారా పిల్లల ఆరోగ్యం గురించి తెలుసుకోవచ్చు అని అన్నారు. అనంతరం పిల్లల పరిశీలించి వారి సమాచారాన్ని స్వయంగా రికార్డులు నమోదు చేశారు. కార్యక్రమంలో తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు, జిల్లా కార్యకలాపాల అధికారి రామ్మోహన్, డాక్టర్లు ప్రమీల, అనూష, అంగన్వాడీ సూపర్వైజర్లు జయశ్రీ, రెడ్డికళ్యాణి, ఎంపిహెచ్ ఈఓ రమేష్, సూపర్వైజర్ హరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని కాపాడాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం, తవణంపల్లి: విద్య హక్కు చట్టాన్ని కాపాడాలని ఆర్‌టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకులు పొన్నా రవికుమార్ కోరారు. గురువారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఫీజుల రూపంలో తల్లిదండ్రులను పీడిస్తోందని, పాఠశాలలో వివిధ రకాల పేర్లు పెట్టి విద్యనభ్యసిస్తామని తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నదని ఆరోపించారు. వీటి గురించి పట్టించుకోవాల్సిన విద్యాశాఖ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తూ ఉండటం వలన, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజులు, అధికంగా పుస్తకాలు డబ్బులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. విద్య వ్యాపారం అయినందు వలన తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని, కనుక విద్యా చట్టం అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జన్నావుల సురేంద్ర, ఈసీ నెంబర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ప్రభావతి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని బంగారెడ్డిపల్లి వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా సిఎఫ్.ప్రభావతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు జిల్లా దక్కిలి గురుకుల పాఠశాల నుండి బదిలీపై గంగాధరనెల్లూరు గురుకుల పాఠశాలకి వచ్చారు. ఇంతకు ముందు ఈ పాఠశాల్లో టీచర్‌గా పనిచేస్తున్న దమయంతి ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మున్సిపాలిటీ, మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భవానీ శంకరి ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ -3 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, వినాయకపురం (చింతలపట్టెడ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు, పాలసముద్రం మండలం కేజేపురం అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఆరుగురు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఓ.వెంకటేశ్వరి, బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీ వైద్యులు రమేష్, నగరి, జీడీ నెల్లూరు సీడీపీవోలు కృష్ణవేణి, విణితశ్రీ, సూపర్‌వైజర్లు శంకరమ్మ, సంగీత, ఆఫీసు సిబ్బంది కరుణాకర్‌రెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై సురేందర్ రెడ్డి బదిలీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేందర్ రెడ్డి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొంది పెద్దపంజాణి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు.

వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దుచేసి నిత్యావసర సరుకులను చౌక దుకాణాల వద్దనే పంపిణీ చేయాలని ఆదేశించింది. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు వికలాంగులు చౌక దుకాణాల వద్దకు రాలేని పరిస్థితులు ఉంటాయని వారికి ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించడంతో పెద్ద ఉప్పరపల్లె 21, 22 చౌక దుకాణాల డీలరు, వీఆర్వో పురుషోత్తం వృద్ధుల ఇండ్లకు వెళ్లి నిత్యవసర సరుకులను ఇచ్చి వచ్చారు.

తుడా లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ ఏర్పాటు చేసిన లేఔట్లలో ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళం సమీపంలో ఏర్పాటు చేసిన శేషాచల హిల్ వ్యూ లే అవుట్ ను గురువారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ లేఔట్ నందు అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. లే అవుట్ నందు అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా చూడాలని అన్నారు ఎస్.హెచ్.వి. లే అవుట్ నందు పార్కులను పరిశీలించి ఆక్రమణలకు గురి కాకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర ఉన్నారు.

క్లస్టర్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ విస్తరణ పనుల్లో భాగంగా తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల సరిహద్దుల నడుమ నిర్మిస్తున్న క్లస్టర్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో రెండు మండలాల మధ్య ఏవైనా భూ వివాదాలు ఉన్నాయా..! అంటూ ఆరా తీశారు. ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మదనపల్లి -నాయుడుపేట జాతీయ రహదారిని, త్వరలో నాలుగు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించనున్న కేటీ రోడ్డును కలుపుతూ ఈ క్లస్టర్ రోడ్డు నిర్మితమవనుంది. తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల, బుచ్చినాయుడు కండ్రిగలోని పెల్లేటివారి కండ్రిగ, ఆలత్తూరు గ్రామాల మీదుగా పల్లమాల వరకు సుమారు 9.2 కిలోమీటర్ల మేర క్లస్టర్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ రోడ్డు నిర్మాణానికి రూ.72 కోట్లు వెచ్చించింది. ప్రస్తుతం పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. రౌతు సూరమాల పరిధిలో 2300 ఎకరాలను ఏపీఐఏసి సేకరించి విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడారుకు అప్పగించింది. బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలో కొంతమేర భూసేకరణ పెండింగ్ లో ఉందని కలెక్టర్ తెలిపారు. క్లస్టర్ రోడ్డు నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయడంతో పాటు భూ వివాదాలను కూడా పరిష్కరించాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆర్కే విద్యార్థులకు ప్రతిభా అవార్డులు





ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్ విద్యామండలి అందించే ప్రతిభా అవార్డులకు చిత్తూరు రుక్మిణి కృష్ణస్వామి జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆర్కే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ డీకే బద్రి నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రతిభ అవార్డులకు తమ కళాశాలకు చెందిన పవిత్ర సాయి 977 మార్కులు, వాగీ సర్వాన్ 945 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి అవార్డులకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ బద్రి నారాయణ, ప్రిన్సిపాల్ రమేష్ బాబు అభినందించారు.

యోగా డే నిర్వహణకు

బోయకొండలో స్థల పరిశీలన



ప్రజాశక్తి- చౌడేపల్లి: ఈనెల 9న యోగాడే నిర్వహించేందుకు పలమనేరు ఆర్డీవో భవాని ఆధ్వర్యంలో గురువారం శక్తి క్షేత్రమైన బోయకొండ ఆలయం ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. తొలుత ఆర్డీవో భవాని కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గోశాల వద్ద దాదాపు 2000 మంది యోగాసనాలు వేసే విధంగా సరిపడా స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంతు, ఎంపీడీవో లీలా మాధవి, ఆలయ ఈవో ఏకాంబరం, అధికారులు పాల్గొన్నారు.

సమాచారం లేక

నిరాశతో వెనుతిరిగిన రైతులు

ప్రజాశక్తి- గంగవరం: రైతులకు ప్రభుత్వం సరఫరా చేసే వేరుశనగ విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారో వంటి సమాచారం ఇవ్వకుండా కేవలం రెండు గంటల సమయంలోనే ముగించి వేరుశనగ విత్తనాలు పంపిణీ ముగిసిపోయాయని చెప్పడంతో ఇక చేసేది ఏమీ లేక రైతులు వెను తిరగాల్సిన దుస్థితి మండలంలో నెలకొంది. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు పడటంతో రైతులు ఎంతో ఆసక్తితో ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాల కోసం వేచి ఉన్న సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా పంపిణీ చేయడం బాధాకరంగా ఉంటుందని రైతులు అటున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిని హేమలతను అడుగగా మండలానికి 930 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని వాటిని రైతు భరోసా కేంద్రాల్లో ఆ పంచాయతీకి సంబంధించి నివేదికల ప్రకారం పంపిణీ చేశామని చెప్పారు. అయితే రైతుల మాత్రం అధికారులకు కావలసిన వారికి మాత్రమే అందజేసి మిగతా వారికి మొండి చేయి చూపారని విమర్శిస్తున్నారు.

ర్యాలీ తరువాత నమాజ్

ప్రజాశక్తి- పుంగనూరు: ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే బక్రీద్ పండుగ శనివారం ఉదయం ర్యాలీతో ప్రారంభమై నమాజుతో ముగుస్తుందని సున్ని అంజుమన్ కమిటీ సభ్యులు సద్దాం బాష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సున్ని అంజుమన్ కమిటీ సభ్యులు, రాతి మసీద్, కుమ్మరి వీధి కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ నమాజ్ టైమింగ్ తెలపడం జరిగింది. బక్రీద్ పండుగ 7వ తేదీ శనివారం ఉదయం పోస్ట్ ఆఫీస్ నుంచి ర్యాలీగా బసవరాజా కాలేజ్ గ్రౌండ్‌కి చేరుకొని 8 గంటలకి నమాజ్ జరుపుకోవాలని తెలిపారు. కావున అందరు సమయానికి వచ్చి ప్రార్థనలు చేసుకోవలసిందిగా సూచించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణానికి సమీపంలోని గూడూరు పల్లి వద్ద నూతన హంగులతో నిర్మాణమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయాన్ని నూతనంగా నిర్మించి లక్ష్మీనరసింహస్వామి ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక బహుమతిని బహుకరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొండవీటి నటరాజ, కే బాలసుబ్రమణ్యం, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, నాగభూషణం, ఆవుల అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

స్విమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి రెండేళ్లుగా యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కరించకపోవడంతో, అనివార్యంగా గురువారం నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వి.సూరి, జి.రవి పేర్కొన్నారు. ఇప్పటికైనా స్విమ్స్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో, 14 రోజుల తరువాత నిరవధిక సమ్మెలోకి వెళతామన్నారు. వేతనాలు పెంచాలని, శానిటేషన్ పేరు మార్చాలని, కార్మికులను శ్రీలక్ష్మీ శ్రీనివాస మేన్ ఫోర్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఉచిత వేసవి శిక్షణా తరగతులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్థానిక కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశంకు ముఖ్యఅతిథిగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగ సౌజన్య విచ్చేసి మాట్లాడారు. పిల్లలు ఈ వేసవి కాలంలో సమ్మర్ క్యాంప్ క్లాసులు ఎంతో ఉపయోగపడుతుందని, అన్ని పాఠ్యాంశాలకు సంబంధించింది కాకుండా స్పోకెన్ ఇంగ్లీష్, యోగ, అబాకస్, డ్రాయింగ్, బుక్ రీడింగ్, కథలు చెప్పడం, సైన్స్ ఎక్స్పెరిమెంట్స్, గురించి నేర్చుకున్నారని తెలిపారు. చదువుతోపాటు సమాజంలో ఆడపిల్లలు వ్యక్తిగత సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అని తెలియజేశారు. తల్లితండ్రులు పిల్లలకు సమాజంలో ఎలాంటి సమస్యలు ఉంటాయో తెలియజేసి దానిని ఏ విధంగా ఎదుర్కోవాలనీ తెలియజేయాలన్నారు. కామన్ ఎగ్జామ్ బోర్డు సెక్రటరీ హేమాద్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌విఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంకు రోజు 50 నుండి 60 మంది విద్యార్థులు హాజరై ఈ కార్యక్రమం విజయవంతం చేశారని కొనియాడారు. ఈ సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు విజయం డిగ్రీ కళాశాల ఏవో రాజగోపాల్ సర్టిఫికెట్స్ మెడల్స్ వితరణ అందించారు. అలాగే విద్యార్థులకు జోయాలుకాస్ వారు 15 రోజుల స్నాక్స్ వితరణగా అందించినట్లు తెలిపారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఆర్.లలిత, అసిస్టెంట్ లైబ్రేరియన్ గజేంద్ర బాబు, రాజ్ కుమార్, భాను, పూర్ణిమ, దేవిబాల, తులసి, గుణశేఖర్, మునీంద్ర, బిలాల్, రాజశేఖర్ సరస్వతి, లవ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సోపానం యోగాతో ఆరంభం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : మానవుడి ఉత్తమ ఆరోగ్యానికి యోగ సోపానం వేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. గురువారం కుప్పం పట్టణంలో కడా పీడీ వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో జరిగిన యోగ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా కడా కార్యాలయం నుండి బస్టాండు మీదగా విచలాపురం కూడలి వరకు యోగ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా బస్టాండు కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి యోగ విశిష్టతను తెలిపే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవుడు ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగాలు తప్పనిసరిగా తమ జీవన విధానంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



యోగ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ఉపాధి పనులను పరిశీలించిన అడిషనల్ పీడీ

ప్రజాశక్తి- సోమల

సోమల మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను అడిషనల్ కందూరు నంజంపేట పంచాయతీలలో పనులు జరుగుతున్న చోటు వద్దకే వెళ్లి పరిశీలించారు. ఫారం ఫండ్ పనులు మొక్కలు నాటే కార్యక్రమాలను పరిశీలించి ఉపాధి సిబ్బందికి సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ షావుకత్ ఆలీ, ఉపాధి సిబ్బంది రైతులు కూలీలు పాల్గొన్నారు.



పనులను పరిశీలించి మొక్కలు నాటుతున్న అడిషనల్ పీడీ

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుమల



టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారిగా కే.వీ.మురళీకృష్ణ గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీవీఎస్వో రంగనాయకులు మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సీవీఎస్వోకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు సీవీఎస్వో వెంకట శివకుమార్ రెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



పవన్ కల్యాణ్‌ను కలిసిన పసుపులేటి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ హస్త కళాభివద్ధి కార్పొరేషన్ చైర్మన్గా బాధ్యతలు తీసుకున్న ఆయన, మొదటిసారిగా జనసేన పార్టీ కేంద్రం కార్యాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

మంగళం కాలువ పోరంబోకు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ పరిధిలోని మంగళంలోని సర్వే నంబర్ 114/2 లో కాలువ పరంబోకు భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ భాగ్యలక్ష్మి 'ప్రజాశక్తి'కి తెలిపారు. కొంతమంది లేఔట్ లో ప్రవేశించి కబ్జాకు ప్రయత్నించి రాళ్లు నాటుతున్నట్లు తమ దష్టికి వచ్చిందని, వాటిని తొలగించడం జరిగిందన్నారు. కబ్జాదారులు ఎవరైనా కాలువ పరంబోకు భూమిని ఆక్రమించిన వారిపై కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తామని హెచ్చరించారు.

ఆర్ ఐఒగా రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఆంధ్రప్రదేశ్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తిరుపతి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా జి.రాజశేఖర్ రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చంద్రగిరి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. అలాగే తిరుపతి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాల ఇంటర్ బోర్డు నియమాలు, విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలి అని కోరారు. అడ్మిషన్స్, కళాశాల లో సౌకర్యాలు, ఇంటర్ బోర్డు నియామవళి ప్రకారం పాటించాలి అని సూచించారు. ఇంటర్ బోర్డు నియమావళి అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లో అడ్మిషన్స్ పెంచేందుకు ప్రిన్సిపాల్స్, కళాశాల అధ్యాపకులు కషి చేయాలి అని సూచించారు. అన్ని యాజమాన్య కళాశాలలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యోగా తరగతులు జరపాలని, యోగాంధ్ర ప్రోగ్రామ్‌ను జయప్రదం చేయాలని సూచించారు.

కోచింగ్ మాఫియాతో కళాశాలలు కుమ్మక్కు : ఎస్ఎఫ్ఐ

కోచింగ్ మాఫియాకు పాల్పడుతున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలను కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐఒకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఐఒ కార్యాలయంలో గురువారం ఆయనను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీలు కోచింగ్ సెంటర్ల మాఫియాగా పాల్పడుతున్నటువంటి రాజు జూనియర్ కాలేజ్(09382) , బివికె విద్య సంస్థలు , మేడ్జి జూనియర్ కాలేజ్(09053) , గీతం జూనియర్ కాలేజీ (09129)లను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఈ కళాశాలలు అలెన్ , అన్ అకాడమీ , ఆకాష్ లాంటి జెఈఈ - నీట్ కోచింగ్ సెంటర్ల రూపంలో ఉన్న "కోచింగ్ మాఫియా "లతో కుమ్మక్కై లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలకు వ్యతిరేకం గా వ్యవహరిస్తున్నటువంటి ఈ కళాశాలల పైన సమగ్ర విచారణచేసి, సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా కార్యదర్శి భగత్ రవి, వినోద్ కుమార్, వీరేష్, రవి, తిమ్మప్ప, మల్లి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా ఎర్పాటు చేసిన 16 అంశాలతో కూడిన బోర్డును పరిశీలించారు. బోర్డు పైన ఉన్న కేసులో పురోగతి లేదని కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. పాత కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక టీం లను ఎర్పాటు చేసుకొవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదిక నుండి వస్తున్న పిటిషన్స్ విచారణ వేగవంతంగా చేయాలన్నారు. మన వద్ద సహాయం కోసం వస్తున్న ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఉపేక్షించేదిలేన్నారు. పోలీసు స్టేషన్ వద్ద నిలబడిన పిటినర్స్ తో ఎస్పీ మాట్లాడారు. బాధితులు చెప్పిన విషయాలను పూర్తిగా విని వారికి న్యాయం చేసే విధంగా వేంటనే చర్యలు తీసుకొవాలని స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బందికి ఆదేశించారు. న్యాయం కోసం వస్తున్న వారిని ఎక్కువ సమయం బయట నిలబడినట్లు మరోసారి నాకు కనబడితే చర్యలు తప్పవన్నారు. పోలీస్ స్టేషను పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొవాల్ససిందిగా పోలీసు సిబ్బందిని ఎస్పి ఆదేశించారు.

క్రైం న్యూస్

నగల దుకాణంలో చోరీ

వేలిముద్రలు, ఇతర ఆదారాల సేకరణ



చోరీ జరిగిన దుకాణాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని జెండామాను వీధిలో ఉన్న శరవణ జ్యువెలర్స్, రంగా స్టీల్స్ దుకాణాలలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు దొంగతనం జరిగిన ప్రదేశాలను గురువారం చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ సాయినాథ్ పట్టణ ఇన్స్పెక్టర్‌లతో కలిసి ప్రత్యక్షంగా సందర్శించి, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బుధవారం రాత్రి రెండు దుకాణాల్లో దొంగతనం జరిగిందని, దర్యాప్తు మొదలుపెట్టామని, రాత్రి దొంగతనం జరిగిన విషయాన్ని తీవ్రంగా పరిగణించామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరణ జరుపుతున్నామని తెలిపారు. సంఘటన స్థలాల్లో వేలిముద్రలు, తదితర శాస్త్రీయ ఆధారాలు సేకరిస్తున్నామని, సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని, ఈ దొంగతనాల వెనుక ఉన్న నిందితుల గుర్తింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిందితులను త్వరితగతిన గుర్తించి పట్టుకునేందుకు చిత్తూరు పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ జరుపుతుందని, త్వరలోనే అరెస్టులు జరుగుతాయని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సంబరాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి

కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనపై జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. గురువారం బాణాసంచా పేల్చి అరాచక పాలన అంతానికి ప్రత్యేకగా సంబరాలు చేసుకున్నారు. పీడ విరగడై ఏడాది పూర్తయిన వేల కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో ప్రజలందరూ ఆనందోత్సవాలలో ఉన్నారని వారు అన్నారు. జనసేన నాయకులు జి.చరణ్ రాయల్, నరేష్, రాకీ గణశ్యామ్, మురళి, మునీంద్ర, టిడిపి నాయకులు కార్తీక్, హరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి..

ప్రజాశక్తి- పుంగనూరు

రాష్ట్రంలో ప్రజల అదృష్టం కొద్దీ ప్రజాస్వామ్య పాలన కొనసాగుతున్నదని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుతో ఏడాది పూర్తవుతుందని ప్రభుత్వానికి ప్రత్యేక శుభాకాంక్షలు గురువారం తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఉచిత సిలిండర్లు 3 ఇప్పటికే రెండు సిలిండర్లకు సబ్సిడీ డబ్బులు ప్రజలకు అందిందని, పింఛన్ రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొన్ని ఇంకా అమలు కాలేదు అన్నారు. ఒంటరి మహిళలకు 1500 వెంటనే ప్రకటించాలని, ఉచిత బస్సు ప్రకటించారని ఆగస్టు నుండి జిల్లా స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయిలో ఉచితంగా ప్రవేశపెట్టాలన్నారు. గత ప్రభుత్వం అక్రమంగా దోచి వేసిన లక్షలాది ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల కార్యకర్తల మీద పెట్టిన కేసులను రాష్ట్ర క్యాబినెట్ తీర్మానంతో రద్దు చేయాలి డిమాండ్ చేశారు.